క్లుప్తంగా

విగ్రహాల నిమజ్జనానికి వసతులు కల్పించండి



కోనేరు వద్ద నీటి పంపింగ్‌ను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ ఇంద్రజ

హిందూపురం: వినాయక విగ్రహాల నిమజ్జనం సమయంలో గుడ్డం కోనేరు వద్ద ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందుస్తు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. శుక్రవారం గుడ్డం కోనేరులో నీటొ పంపింగ్‌ను పరిశీలించారు. విగ్రహాల నిమజ్జనానికి కోనేరును నీటితో పూర్తిగా నింపాలన్నారు. అలాగే పక్కన చిన్న కోనేరులో చిన్న విగ్రహాల నిమజ్జనానికి వీలుగా సౌకర్యాలు కల్పించాలన్నారు. బారికేడ్లు, లైటింగ్ ఇతర సదుపాయలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఈ జనార్దన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి ఎస్‌పీ 160 సీసీ హోండా



వాహనాన్ని లాంచ్ చేస్తున్న సంస్థ నిర్వాహకులు

హిందూపురం అర్బన్: పట్టణంలోని ప్రీమియం హోండా షోరూంలో శుక్రవారం అధునాతన సాంకేతికతతో కూడిన ఎస్‌పీ 160 సీసీ హోండా ద్విచక్ర వాహనాన్ని మేనేజింగ్ డైరెక్టర్లు ప్రసాద్‌రెడ్డి, నారాయణరెడ్డి ఆవిష్కరించారు. పీజీఎస్–ఎఫ్1 ఇంజన్, ఫెటల్ డిస్క్, ఎల్‌ఈడీ లైటింగ్ కలిగి సీటుతో ఈ ద్విచక్ర వాహనాన్ని డిజైన్ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏరియా సేల్స్ మేనేజర్ ఎల్.ప్రసాద్, షోరూం మేనేజర్ శ్రీధర్, బయ్యారెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి

హిందూపురం: ప్రజల సౌకర్యార్థం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు ఎదుట సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు వేణురెడ్డి అన్నారు. శుక్రవారం 30వ వార్డు కౌన్సిలర్ ఆసీఫ్‌వుల్లాతో కలసి సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. పనులు నాణ్యతగా చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసు వద్ద లైటింగ్ ఇతర సదుపాయాలు కూడా కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్కే ఖలీల్, ఆనందరెడ్డి, రియాజ్, మస్తాన్, శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

హిందూపురం: నూతనంగా ఏర్పాటైన న్యూ కమర్షియల్ మార్కెట్ కాంప్లెక్స్‌లో వ్యాపారులు, ప్రజల రాకపోకలకు అనువుగా సదుపాయాలు మెరుగుపర్చాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం న్యూ మార్కెట్ కాంప్లెక్స్‌ను మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, వ్యాపారులు, నాయకులు సందర్శించారు. గాంధీ సర్కిల్ వద్ద ఆలయ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని వ్యాపారులు కోరారు. ప్రాంతాన్ని పరిశీలించి, స్థలాన్ని కేటాయిస్తామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో కమర్షియల్ మార్కెట్ వ్యాపారులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంత రెడ్డి, ఆనంద్‌రెడ్డి, మస్తాన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బిట్ కళాశాలలో ఇంజనీర్స్ డే



విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్: బిట్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఇంజనీర్స్ దినోత్సవం సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశంలో ప్రధాన కట్టడాలకు రూపకల్పన చేసిన మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పెనుకొండ పంచాయతీ రాజ్ డీఈ మురళీమోహన్, ఏఈ సత్యశ్రీ, కాంట్రాక్టర్ ప్రతాప్‌రెడ్డి, ప్రిన్సిపల్ రమేష్, ఆధ్యాపకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

చిలమత్తూరు: మండల కేంద్రానికి రైతు ఆనంద్ బాబు (38) గురువారం పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేసిన విషయం తెలిసిందే. అనంతపురం జిల్లా సర్వజనాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమం సీఎం జగన్‌తోనే సాధ్యం

గుడిబండ: అభివృద్ధి, సంక్షేమం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి అన్నారు. శుక్ర వారం మండలంలోని గుడిబండలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఎంపీపీ రాధమ్మ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటూనే ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు అందాయా, లేదా అనే విషయం లబ్ధిదారులను ఆరా తీశారు. ఒకవేళ అందకపోతే వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కార చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 95 శాతం అమలు చేశారన్నారు. గత నాలుగేళ్ల పాలనలో ఒక్కో కుటుంబానికి రూ.లక్షల్లో లబ్ధి చేకూర్చారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి అర్హత ఉంటే చాలు, పార్టీలు, కులమతాలు చూడకుండా ప్రతి ఒక్కరికీ పింఛన్ అందిస్తున్నారని గుర్తు చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏళ్ళ తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగినా పింఛన్ వచ్చేది కాదన్నారు. జన్మభూమి కమిటీలు టీడీపీ వారికే పింఛన్ మంజూరు చేయించే వారని ఆరోపించారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ప్రజలకు దొంగ హామీలు ఇచ్చి అధికారంలో వచ్చిన చంద్రబాబు మరోసారి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామారావు, తహసీల్దార్ నాగభూషణం, జెడ్పీటీసీ భూతరాజు, ఈఓఆర్డీ నాగరాజునాయక్, ఏపీఎం ముత్యాలప్ప, సింగల్‌విండో అధ్యక్షుడు చంద్రశేఖర్, సర్పంచ్‌లు యంజారేగౌడు, రంగస్వామి, సతీష్, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కె.శివకుమార్, బీసీ, ఎస్సీ సెల్ కన్వీనర్లు పాండు, రమేష్, నాయకులు రమేష్, ప్రభు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.



గుడిబండలో లబ్ధిదారులకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి



హుస్సేన్‌పురంలో పథకాల కరపత్రాలను అందజేస్తున్న పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక

ఇంటింటికీ సంక్షేమ లబ్ధి

- పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక

చిలమత్తూరు: పేదల మొహాల్లో చిరునవ్వు చూడాలన్న సంకల్పంతో సీఎం జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. శుక్రవారం మండలంలోని వీరాపురం పంచాయతీలోని హుస్సేన్‌పురం, భూపసముద్రం, దాదిరెడ్డిపల్లి, తండా, లక్ష్మీపురం గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు ఎంపీపీ పురుషోత్తమ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా టీఎన్ దీపిక ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు చేకూరిన సంక్షేమ లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. భూపసముద్రంలో బోయ ఆదినారాయణప్ప కుటుంబానికి రూ.8 లక్షల లబ్ధి చేకూరిందని ఎంపీపీ పురుషోత్తమరెడ్డి సమన్వయకర్తకు తెలిపారు. సీఎం జగన్ పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. రాబోవు ఎన్నికల్లో సీఎం జగన్‌ను మళ్లీ గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే బాలకృష్ణ ఏనాడూ గ్రామీణ ప్రాంతాలను చూడలేదని ఎద్దేవా చేశారు. అలాంటి వ్యక్తి మనకొద్దన్నారు. స్థానికులుగా మన ప్రాంతాన్ని మనం అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేష్‌కృష్ణ, తహసీల్దార్ నాగరాజు, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, వైస్ ఎంపీపీలు బయప్ప, అంజలీ దేవి, ఎంపీటీసీ జగన్మోహన్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి, మురళి, సింగిల్ విండో చైర్మెన్లు హనుమంత రెడ్డి, దివాకర్‌రెడ్డి, అమరనాథ్, మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు రామకృష్ణా రెడ్డి, సదాశివరెడ్డి, శివప్రసాద్ రెడ్డి, రాజారెడ్డి, నాగరాజు యాదవ్, బాబేనాయక్, షాకీర్, మహేంద్రరెడ్డి, నారాయణ స్వామి పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

లేపాక్షి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ డి.క్రిష్ణయ్య శుక్రవారం మధ్యాహ్నం పరిశీలించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. అనంతరం రికార్డులను పరిశీలించి, సూచనలిచ్చారు. ఈనెల 30వ తేదీ నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకూ జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను అన్ని గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎంపీడీఓ, తహసిల్దార్, ఇతర శాఖల అధికారులు, ఉద్యోగులు, ప్రజల సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ వెంకట చిరంజీవి, ఎంపిహెచ్ఓ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

రొళ్ల: మండలంలోని ఎం.రాయాపురం సచివాలయం ఆవరణలో శుక్రవారం ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన సామాజిక భద్రత పింఛన్లను లబ్ధిదారులకు సర్పంచ్ నరసింహప్ప, వార్డు మెంబర్ వజీర్‌సాబ్, నాయకుడు సీఎంఘట్టు రవి తదితరురు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

బోరుకు మరమ్మతు

లేపాక్షి: మండలంలోని మానేపల్లి పంచాయతీ బీసీ కాలనీలో ఉన్న తాగునీటి బోరుకు సర్పంచ్ నిర్మలమ్మ తన సొంత ఖర్చులతో శుక్రవారం ఉదయం మరమ్మతులు చేయించారు. తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో కాలనీవాసులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నిలకడలేని వ్యక్తి పవన్ కళ్యాణ్



ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ నిలకడలేని వ్యక్తి అని ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు డాక్టర్ తిప్పేస్వామి శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో విమర్శించారు. పవన్‌కు ఒక విధానమంటూ లేదన్నారు. ఆయనకు పార్టీ కన్నా ప్యాకేజీ ముఖ్యమన్నారు. జనసైనికులను చంద్రబాబుకు తాకట్టు పెట్టారని ఆరోపించారు. డబ్బుకోసం పవన్ ఏమైనా చేస్తారని ధ్వజమెత్తారు. జైలుకెళ్లి చంద్రబాబును పరామర్శించడానికి కూడా ప్యాకేజీ తీసుకున్నా ఆశ్చర్యం లేదన్నారు. మొదటి నుంచి టీడీపీతో పవన్‌కల్యాణ్ కుమ్మక్కై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విషం చిమ్మారని ఆరోపించారు. ప్యాకేజీ రాజకీయాలు చేస్తున్న పవన్‌కల్యాణ్‌ను ప్రజలు నమ్మరన్నారు. టీడీపీ, జనసేన పొత్తు అనైతికమన్నారు. ప్రజలు ఆ పొత్తును ఛీ కొడుతున్నారని విమర్శించారు. ఎన్ని కుట్రలు చేసినా ఎన్నికల తర్వాత టీడీపీ, జనసేన ఉండవన్నారు. అవినీతి చేసి జైలుకెళ్లిన చంద్రబాబుతో పవన్ చేతులు కలపడం చాలా దురదృష్టకరమన్నారు.వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్ విజయాన్ని ఆపడం వారి చేతకాదన్నారు. ప్రజలు జగన్ వైపే ఉన్నారని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

మడకశిరరూరల్: మండలంలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని బుళ్లసముద్రం బస్టాండ్‌లో శుక్రవారం రాత్రి ఆటో, ద్విచక్రవాహనం ఢీకొని అమరాపురం మండలం మదనకుంట గ్రామానికి చెందిన అనిల్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. హిందూపురం నుంచి ద్విచక్రవాహనంలో అనిల్‌కుమార్ మడకశిరకు వస్తుండగా బుళ్లసముద్రం బస్టాండ్‌లో ఆటోను ఢీకొన్నాడు. స్థానికులు 108 వాహనంలో మడకశిరకు తరలించి చికిత్సలు అందించారు. అలాగే బంద్రేపల్లికి చెందిన చలవరాజ్ శుక్రవారం రాత్రి ద్విచక్రవాహనం తోసుకొంటూ వెళ్తున్న సమయంలో నీలకంఠాపురం వద్ద గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీకొంది. గాయపడిన చలవరాజ్‌ను 108 వాహనంలో మడకశిరకు తరలించి చికిత్సలు అందించారు. అదేవిధంగా ప్రభుత్వ వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ద్విచక్రవాహనం ఢీకొని దాసప్పపాళ్యం గ్రామానికి చెందిన శివకుమార్ తీవ్రంగా గాయపడ్డారు. శివకుమార్ ద్విచక్రవాహనంలో మడకశిరకు వస్తుండగా మడకశిర నుంచి అటువైపు వెళ్లతున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. 108 వాహనంలో శివకుమార్‌ను మడకశిరకు తరలించి చికిత్సలు నిర్వహించారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

మడకశిర/రూరల్: మడకశిర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శుక్రవారం జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పలు రికార్డులను పరిశీలించారు. భూముల క్రయ విక్రయాలపై ఆరా తీశారు. భూములు, ఇతర ఆస్తుల రిజిస్ట్రేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టాంపుల కొరతపై ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ క్రయ విక్రయాలను నిబంధనల ప్రకారం చేయాలని సూచించారు.నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ భాగ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఆమె కుటుంబసభ్యులతో కలిసి మండలంలోని నీలకంఠేశ్వరస్వామి సముదాయ దేవాలయాలను సందర్శించారు.

రొళ్ల: మండలంలోని రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి అమ్మవారిని ఉమ్మడి అనంతపురం జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారి కుటుంబ సమేతంగా శుక్రవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అలాగే కొత్తపాళ్యం గ్రామంలో వెలసిన వేంకటేశ్వరస్వామి కూడా ఆమె దర్శించుకుని తీర్థప్రసాదాన్ని స్వీకరించారు.



సరస్వతీదేవికి పూజలు నిర్వహిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారి

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

రొళ్ల: అలుపనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తాలూకా స్థాయిలో నిర్వహించిన స్కూల్‌గేమ్స్ సెలెక్షన్స్ క్రీడా పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికై నట్లు వ్యాయామ ఉపాధ్యాయురాలు బి.బి.మంజుళ, హెచ్‌ఎం ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. బాలుర అండర్–14 యోగాలో ఆర్.తిప్పేస్వామి, అండర్–14 ఖోఖో విభాగంలో ఎం.జగన్, అండర్–17 ఖోఖో విభాగంలో ఆర్.ఎస్. సంతోష్, అండర్–14 త్రోబాల్ విభాగంలో ఆర్.కార్తిక్, సి.మహేష్‌బాబు, అండర్–17 త్రోబాల్ విభాగంలో జి.మోహన్, అండర్–14 బాల్ బ్యాడ్మింటన్ విభాగంలో ఎస్.పునీత్, హేమంత్, రాజేష్, ఆర్.సంతోష్, అండర్–17 బాల్ బ్యాడ్మింటన్ విభాగంలో నందన్‌గౌడ, అభిలాష్, ఎస్.పవన్ ప్రథమ స్థానంలో నిలిచారన్నారు.

కోగిర విద్యార్థుల సత్తా..

రొద్దం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన క్రీడాపోటీల్లో కోగిర పాఠశాల విద్యార్థులు డివిజన్ స్థాయికి ఎంపికైనట్లు పీఈటీ శ్రీదేవి తెలిపారు. 800 మీటర్లు, 600 మీటర్ల పరుగు పందెంలో విజయ్ ప్రథమస్థానం, 600 మీటర్ల పరుగు పందెంలో గోపిచంద్ ద్వితీయ స్థానంలో నిలిచారు. షాట్‌పుట్ బాలుర విభాగంలో మోహన్ ప్రథమ స్థానంలో, వాలీబాల్ పోటీల్లో విజయ్, దర్శన్, మధు ప్రతిభ చూపారు.



డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

జూనియర్స్ విభాగంలో షటిల్ పోటీల్లో బాలుర విభాగంలో విజయ్, బాలికల విభాగంలో మేఘన, అనిత, అలేఖ్య, శిరీష విజయం సాధించారు.

స్కూల్ గేమ్స్ నియోజకవర్గ జట్ల ఎంపిక

హిందూపురం టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంజీఎం పాఠశాల మైదానంలో నియోజకవర్గ స్థాయి జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. అండర్–14, అండర్–17 విభాగాలకు సంబంధించి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, యోగ, అథ్లెటిక్స్‌కు జట్లను ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈఓలు గంగప్ప, ప్రసన్నలక్ష్మి తెలిపారు. హెచ్‌ఎం సామ్రాజ్యం, పీడీలు రామకృష్ణ, సురేష్‌కుమార్, శివకుమార్, మోరార్జీ యాదవ్, రామాంజినేయులు, రామ్మూర్తి నాయక్, శ్రీనివాసులు, ఎంజీఎం పీడీలు లోకనాథ్, విలియమ్స్, రాణి, ప్రవీణ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని గౌరవించాలి

పావగడ: అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని గౌరవించాలని ప్రిన్సిపాల్ కేఓ మారెప్ప సూచించారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల లో శుక్రవారం నిర్వహించిన అంతర్ రాష్ట్రీయ ప్రజాప్రభుత్వ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులతో ప్రిన్సిపాల్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రామాంజనమ్మ, అధ్యాపకులు మిను, ప్రకాశ్, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే స్థానిక దళిత జాగృతి సంస్థ ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వ దినోత్సవాన్ని స్థానిక అతిథి గృహం వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీజేఎస్ తాలూకా అధ్యక్షుడు నారాయణప్ప అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ నిబంధనలు, సూత్రాలను కరపత్రం ద్వారా చదివి వినిపించారు. తాలూకా వ్యాప్తంగా సుమారు 80 మంది డీజేఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య భద్రతే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యం

పరిగి: ఆరోగ్య భద్రతే జగనన్న ఆరోగ్య సురక్ష పథకం లక్ష్యమని అధికారులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీడీఓ సరస్వతి మండల ప్రత్యేకాధికారి ప్రసాద్‌రావు, ఎంపీపీ సవిత, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి ప్రభాకర్, ఎంపీటీసీలు చంద్రారెడ్డి, మారుతీరెడ్డి, ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం, డిప్యూటీ తహసీల్దారు నరసింహమూర్తి, సీహెచ్ఓ వన్నప్ప, మాజీ కన్వీనర్ జయరాం పాల్గొన్నారు.

రొళ్ల: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎంపీడీఓ ఆజాద్ అన్నారు. శుక్రవారం రత్నగిరి సచివాలయం పరిధిలో ఇంటింటా సర్వేను ఈఓఆర్డీ క్రిష్ణప్పతో కలసి ఎంపీడీఓ ఆజాద్ పర్యవేక్షించారు.

అగళి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి చంద్రశేఖర్, వైద్యాధికారి శివానంద,ఎంపీడీఓ ఆర్.రవిప్రసాద్, సూపర్‌వైజర్ నర్సారెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పించాలి

పెనుకొండ: జగనన్న ఆరోగ్యసురక్షపై ప్రజలకు అవగాహన కల్పించాలని పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. మండలంలోని మునిమడుగులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సబ్ కలెక్టర్ కార్తీక్ శుక్రవారం ప్రారంభించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరోగ్య సురక్షపై ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బందికి సూచించారు. తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ పాల్గొన్నారు.



గోరంట్ల: సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి విజయకుమార్‌రెడ్డి

రొద్దం: సుబ్బరాయప్పకొట్టాల గ్రామంలో డాక్టర్ జగదీశ్‌బాబు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభించారు. మండల ప్రత్యేక అధికారి పీడీ నరసయ్య, ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ పోస్టర్లను విడుదల చేశారు. ఎంపీపీ చంద్రశేఖర్, సర్పంచ్ రూప, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, కార్యదర్శి జనార్దన్ పాల్గొన్నారు.

గోరంట్ల: ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా పంచాయతీ అధికారి, ప్రత్యేక అధికారి విజయకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కొండాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీపీ ప్రమీల, జెడ్పీటీసీ పాలేజయరాంనాయక్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిత, ఎంపీటీసీ సునంద, వైద్యులు సుప్రియ, సాయిసుదేష్ణ, ఎంపీడీఓ రఘునాథగుప్త , ఎంఈఓ గోపాల్, పంచాయితీ కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు.

హిందూపురం అర్బన్: తూమకుంట, గోళ్లాపురం సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు జగనన్న ఆరోగ్య సురక్షపై కార్యదర్శి కెంచరాయప్ప అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని నెలరోజుల పాటు నిర్వహిస్తామని ఎంపీడీఓ నరేంద్రకుమార్ తెలిపారు.

హిందూపురం: జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌పై అవగాహన కల్పించాని కమిషనర్ ప్రమోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం 11,12 వార్డుల్లోని సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అటెండెన్స్ రిజిష్టర్‌ను పరిశీలించారు. సమయపాలన, పనితీరుపై ఆరా తీశారు.

లేపాక్షి: చోళసముద్రం గ్రామ సచివాలయంలో శుక్రవారం ఉదయం వలంటీర్లు, ఆరోగ్యకార్యకర్తలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. మండల స్పెషల్ ఆఫీసర్ సుదర్శన్ మాట్లాడుతూ.. అందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ నరసింహనాయుడు, తహసీల్దార్ బాబు, వైద్య సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.

ఇంటింటా సర్వే చేపట్టండి

అమరాపురం: ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య సర్వే పక్కాగా సర్వే చేయాలని ఎంపీడీఓ మునిస్వామి సూచించారు. శుక్రవారం మండలంలోని తమ్మడేపల్లి– 2 గ్రామ సచివాలయంలో వలంటీర్లు, ఆరోగ్య, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కాగా అధికశాతం వలంటీర్లు కార్యక్రమానికి హాజరు కాక పోవడంతో ఎంపీడీఓ అసహనం వ్యక్తం చేశారు. హాజరు కాని వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగముని, సచివాలయం జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ గిరిజమ్మ, నాయకులు సదానందగౌడ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు

రొద్దం: మండల కేంద్రంలోని జగనన్న లేఅవుట్‌లో నిర్మిస్తున్న ఇళ్లకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జియాలజిస్ట్ ఇమ్రాన్ అన్నారు. శుక్రవారం కాలనీలో తాగునీటి బోరు తవ్వడానికి బోరు పాయింట్ పెట్టారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ సోని, ఫీల్డ్ అసిస్టెంట్ షామీర్ పాల్గొన్నారు.

కొలిమిపల్లిలో ఘర్షణ

గోరంట్ల: మండలంలోని కొలిమిపల్లి గ్రామంలో పొలానికి నీళ్ల వంతు విషయంలో కేశవ, చంద్రాయుడు వర్గాల మధ్య శుక్రవారం ఘర్షణ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. కేశవ, చంద్రాయుడు సమీప బంధువులు. వ్యవసాయ పొలంలో బావి నీళ్లు వాడుకునే విషయంలో గొడవ పడ్డారు. గొడవలో కేశవ అనే వ్యక్తి చంద్రాయుడుపై దాడి చేశాడు. ఈ దాడిలో చంద్రాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతన్ని గోరంట్ల ఆస్పత్రికి తీసుకెళ్లారు.

సానుకూల దృక్పథం అలవర్చుకోండి

హిందూపురం టౌన్: విద్య, కుటుంబ సామాజిక సమస్యలపై విద్యార్థినులు సానుకూల దృక్పథం అలవర్చుకోవాలని మానసిక వైద్యురాలు జీవన అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నేషనల్ హెల్త్ కార్యక్రమం కింద ఆత్మహత్యల నివారణపై అవగాహన కల్పించారు. పోటీ ప్రపంచంలో ఒత్తిడిని ఎదుర్కొనేందుకు సూచనలిచ్చారు. మానసిక సమస్యలు ఉంటే 14416 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మురళీ మోహన్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి

రొళ్ల: ఖరీఫ్‌లో వివిధ పంటలు సాగు చేసిన రైతులు ఈ నెలాఖరులోపు ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని ఏఓ రాజ్యలక్ష్మి సూచించారు. శుక్రవారం మండలంలోని గుడ్డగుర్కి ఆర్‌బీకే పరిధిలో వీఏఏలు చేపట్టిన ఈ–క్రాప్ నమోదు పర్యవేక్షించారు. ఏఓ మాట్లాడుతూ ఈ–క్రాప్ నమోదు చేసుకోకపోతే ప్రభుత్వం అందించే పరిహారం వర్తించదన్నారు. అలాగే రైతులు ఈ–కేవైసీ చేసుకోవాలని సూచించారు.

కుస్తీ రెఫరీ పోటీల్లో సత్తా

హిందూపురం టౌన్: హర్యానాలోని రోహతక్‌లో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి అండర్–11,15 గ్రాప్లింగ్ కుస్తీ రెఫరీ పోటీల్లో హిందూపురానికి చెందిన ఉసామా ఖాన్ సత్తా చాటాడు. జాతీయ గ్రాఫింగ్ రెజ్లింగ్ కమిటీ చైర్మన్ దినేష్ కపూర్, జనరల్ కార్యదర్శి బీర్జుశర్మ, ఏపీ చైర్మన్ సురేంద్రరెడ్డి చేతుల మీదుగా పతకం అందుకున్నారు. కార్యక్రమంలో కోచ్‌లు రమేష్, చరణ్ పాల్గొన్నారు.

దారికి అడ్డంగా మట్టిదిబ్బ



మట్టి దిబ్బను చూపిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

అమరాపురం: మండలంలోని బుల్లేపల్లిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే రహదారికి అడ్డంగా ఇద్దరు వ్యక్తులు మట్టిదిబ్బ వేసినట్లు అంగన్‌వాడీ కార్యకర్త తిమ్మక్క వాపోయారు. అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లడానికి దారి ఉన్నా.. లేదని బుకాయిస్తూ రోడ్డుకు అడ్డంగా మట్టి దిబ్బ వేశారన్నారు. కేంద్రానికి ఏడుగురు చిన్నారులు వస్తున్నారని, ఈ దిబ్బ వేయడం వల్ల ఇబ్బంది పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి దారి చూపాలని కోరారు.

25న కలెక్టరేట్ ముట్టడి

మడకశిర: మాదిగల సమస్యలపై ఈనెల 25న నిర్వహించే కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం వారు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు అక్కులప్ప, గంగాధర్, హనుమంతప్ప, గోవిందప్ప, నాగరాజు, శివప్ప, జానకిరామ్, శంకర్, రామాంజనేయులు, చందు, మూర్తి, అంజి, శివ పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గుడిబండ: గుడిబండ సచివాలయం–1 మోపురుగుండు, సింగేపల్లి గ్రామాల్లో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ రాధమ్మ శుక్రవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పాల్గొంటారన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

మడకశిరరూరల్: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులు, చిన్నారుల తీసుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి సూచించారు. శుక్రవారం గోవిందాపురంలో పంచాయతీ స్థాయి పౌష్టికాహార మాసోత్సవాలు, సీమంతాల కార్యక్రమం నిర్వహించారు. చిరుధాన్యాలు, ఆకుకూరల ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు.

ఆదాయ వనరులను పెంపొందించుకోవాలి

మడకశిరరూరల్: మండలంలోని ఆర్.ఆనంతపురం ఆర్డీటీ కార్యాలయంలో శుక్రవారం గ్రామ స్థాయి నాయకుల స్వశక్తీకరణ పునఃశ్చరణ సమావేశం నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ బాలంజనేయులు, ఎస్ఐ లోకేష్ మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో సమష్టిగా ప్రభుత్వ సంస్థల నుంచి ఆదాయ వనరులను పెంపొందించుకుని గ్రామాభివృద్ధికి సహకారం అందించాలన్నారు. ఆర్డీటీ ఆర్డీ మల్లికార్జున మాట్లాడుతూ.. ప్రజలు అధికారులతో పరిచయాలు పెంచుకుని సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏటీఎల్ సుదర్శన్‌రెడ్డి, గ్రామీణులు పాల్గొన్నారు.